# మనిషిలోని మనిషి

యం. హీరాలాల్ రాయ్

జీవితంలో రెండు డజనుల సార్లు వసంతాలు, వర్షాలు వచ్చిపోయినాక, ఇవాళ నాకు ఏదో పెద్ద జ్ఞానోదయం కలుగబోతూన్నట్టనిపిస్తూంది. లోకాన్ని బాగా కళ్ళెత్తి చూడలేని పసినాటి గుడ్డిరోజులే మంచివేమో? మన పక్కన ఏం జరుగుతుందీ ఎరక్కుండా బతకటం ఎంతహాయి. లేదా మన చుట్టూ జరుగుతోన్న సంఘటనల్ని చూసి, నిశ్చలంగా మొండి బండమాదిరి బతకడమన్నా రావాలి. అదిచేతగాని నాకు చుట్టూ జరుగుతూన్నది కనబడకుండా గుడ్డితనం వస్తే మంచిది. ఇవాళ, పెద్ద పెద్ద కళ్ళొచ్చి, లోకం అంతా చూస్తో మనని కాదన్నట్టు బతకడం చేతకాని దుర్బల హృదయాల మనుష్యుల్లో నేనొకణ్ణి.

ఉద్రేకాలు ఊగిపోయి, జీవితాల్ని జైళ్ళలో, సంచారాల్లో పడవేసి, అన్నలు, నాన్నలూ నెత్తికొట్టి, ఆస్తినిదిగమింగి మొండిచేయి చూపించాక, అప్పుడు స్పృహవచ్చి, ఒక పెళ్ళాం, ఇద్దరు పిల్లలుఅరుస్తూంటే ఊరుకోలేక ఓ బట్టల కొట్లో భాగస్తుడిగా చేరాను. కొట్టు పేరెత్తితే గిట్టని ఈ గాలి ఈతగాడికి, వో తలుపులేనిగూడు దొరికింది. బట్టలకొట్టులా జీవితానికీ, పట్టుదారం అల్లుకుని చచ్చే పట్టుచిలకకీ ఏం తేడా...?

ఆదర్శాలు, ఆశయాలు, ఆత్మగౌరవం ఇవన్నీ జపం చేస్తో, వీటికి పచ్చివ్యతిరేకమైన దైనందిన జీవితంలో, అడుగడుక్కూ మనని మనం ఖూనీ చేసుకుని బతకడం చూస్తున్నాం. తప్పదు. ఊరిలో ఒక పెద్దవుంటే, వాడి దయా, దాక్షిణ్యాలకు లొంగి, ఇష్టం లేకున్నా దణ్ణంపెట్టి ఏదోవాడి విషపు చూపునుంచి తప్పుకొని బతకాలి. అలా కాకుండా, వాన్ని ధిక్కరిస్తే, ఏ పూటకాపూట కటకటపడేబతుక్కి ఈ చిక్కులు తట్టుకోవడం సాధ్యమా? ఇలా వాస్తవాలని గ్రహించి, నా హృదయాన్ని విరగ్గొట్టి పొయ్యిలో పారేసి, ఖాళీగుండెతో బతకడానికి నిశ్చయించుకొని కొట్లో చేరాను.

చేరానేగాని, నా భాగస్తుడితో, సమానమైన హాయిలో వ్యాపారంజరపడం రావద్దూ? పిల్లచచ్చినా ఏదోవాసనపోనట్టు, పాతనాటి వెర్రిఅభిరుచులకి అలవడ్డబతుకు, ఒక్కమాటు గిర్రున 'ఎబౌట్ టర్న్' చేసి, అంతా మరిచిపోయి కొత్త లోకంలో కలిసిపోవడం సాధ్యం కాలేదు. దేశం ఆదేదో మూలన ఏమో అవుతూంటే, ఏదో ఆదుర్దా నాకు. అది మా పార్ట్నర్ కు లేదు. 'నీ కెందుకోయ్! అక్కడేదో జరిగితే!' అంటాడాయన. నిజమే, అక్కడెక్కడో ఏదోఅవుతే నాకేమిటి? బుద్ధిఉండకూడదూ! కానిబుద్ధిలేదు రాదు.

ఒకనాడు మా కొట్టు ముందరే - అది మరెక్కడో జరక్కూడదూ - నా ఖర్మమా అని. ఒక అనాథ స్త్రీ హటాత్తుగా ప్రసవించింది. ఒంటినిండా రక్తం... గుడ్డలన్నీ నెత్తురు... అయ్యో! ఒక చీరగుంజి ఆవిడమీద పారేశాను. నెత్తురు ఆపడానికి చాల్లేదు. మరోటి, మరోటి, మరోటి... మా భాగస్తుడు నా లెక్కలో అన్నీ రాసేసి కూచున్నాడు. ఆ తరవాత తన దగ్గరగా పిలిచి అన్నాడు: ఇదో, నీవు వట్టి పనికిరాని పిరికి గుండె మనిషివి. రోడ్లో ఏదో అవుతే కొట్లో కొత్త చీరలు ఇస్తున్నావు. ఇలా చేస్తుంటే నిన్ను లోకం మెసలనివ్వదు. వాడేసుకుంటుంది. నీవు సహాయం చేయలేనినాడు మరచిపోతుంది. అంతే' అన్నాడు. నిజం కాని, మనకుబుద్ధిరాందే

అన్నట్టు ఒక రచయిత పెద్ద జబ్బునపడ్డాడు. 'ఇక ఆశల్లేవు, నేను చనిపోతా' నన్నాడు నన్ను దగ్గరగా పిలిచి. నిజంగా అంత ప్రమాదకరమైన జబ్బు. అవసాన దశలోవున్నాడు. నా దగ్గర మిత్రుడు. ఏమీ సహాయం చేయలేని స్థితిలోవున్నాను. అతని ముఖంలో రోగం వికారంగా కనపడుతూన్నది. చావు సమీపిస్తున్నది. అతను చావుకు భయపడడు. ధైర్యంగా చస్తాడు. కాని నేను...! బతికే చస్తాను. చచ్చి బతుకుతాను. అయోమయం. ఆ చనిపోయే మిత్రుడి అంత్యక్రియలు! కర్మలు! యేభైరూపాయలు! ఏవి? ఒక రాత్రల్లా నాకు ఇదే ఆలోచన రచయితని ఎలా కాల్చాలి. కర్ర లేవి? డబ్బేది?

ఉదయాన్నే గబగబా వెళ్ళి రచయితను బ్రతిమాలాను 'నీవు చావకు మిత్రమా! నీవు చస్తే చాలా చిక్కువస్తుంది. నాకోసం దయతలచి బతికివుండు. చస్తే నిన్ను కాల్చడానికి డబ్బు లేదు. బతికుంటే, ఎలాగో రోజో రూపాయి ఇచ్చుకుంటాను. ఒక్కసారే యాభై రూపాయలు లేవు. ఊహుఁ. నీవు చస్తే నీబాధ పోతుందికాని, నాదుంప తెగుతుంది. చావకు, చావకు!' అని మొత్తుకున్నాను.

'ఇంకా కొన్నాళ్ళు బతికి బాధపడమన్నావా?' అన్నాడు రచయిత నాతో. 'నా బాధ తప్పించడానికి బతికి బాధపడు!' అని బతిమాలాను. పాపం! బతికాడు రచయిత.

ఎంత ఘోరాన్ని నా మనస్సు ఆలోచిస్తోంది. అబ్బా! మనస్సులో ఎక్కడా దయా, కరుణ, దాక్షిణ్యం ప్రేమ లేకుండా, పట్టి కరడుగట్టిన రియలిజం కప్పుకుంటున్నది. ఈ వాస్తవవాదం, భౌతికవాదం ఒకనాటికి మానవుల్ని గట్టి క్రూర జంతువుల కిందికి మార్చకపోవు.

హృదయం గుగ్గిలంమాదిరి కాల, కాగ అలచి పోయాక, ఇంకా గుండెలో యేముంటుంది? నెత్తుటి మడుగు తప్ప!

ఇవాళ చిన్న రాక్షసిని పెద్ద రాక్షసి తినాలని చూస్తోంది. ఈ తినే తగాదాలో పెద్ద రాక్షసులూ పెద్ద రాక్షసులూ కొట్టుకుంటాయి. నశిస్తాయి! నశించాలి! రాక్షసులు లోకానికి తగిన ప్రాణులు కాదు. అందుకోసం యుద్ధాలు చేసి చావనీండి! చావడం తప్పదు. అయితే ఒక్క జిజ్ఞాస. అదేమిటంటే ఈ రాక్షసుల కాళ్ళక్రింద ఈ చీమల్లాంటి ప్రజ!

ఇరవై నాలుగు ఉగాదులు జరుపుకున్న నా బతుకు నేడు నేర్చుకున్న చదువు ఒక్కటే. మరోవాణ్ణి చంపు. లేదా, ఇంకోడు చంపుతూంటే చూసి వూరుకోవడమన్నా కనీసం నేర్చుకో! 'అయ్యో!' అని దయ చూపావా, నీవూ చస్తావు! అప్పుడు నీవూ వుండవు. నీ ఆదర్శాలూ లేవు' ఇదీ నేను నేర్చుకున్న విద్య. ఏం విద్య! బలేబలే మంచి విద్య! గొప్ప విద్య!

---

# కిరీటము

**సాళ్వ కృష్ణమూర్తిశాస్త్రి**

ఇది యేమి నీ కిరీటాగ్రమో!
నీ విరాడ్రూపమో!!
నీ మహాస్వప్నమో!!!
ఈ ఊర్ధ్వలోకాతీత ధవళ కాంతి శృంగ
భయద భయదౌన్నత్య దైర్ఘ్యమ్ము
లెవ్వరివి నాయెదుట
నివ్వటిల్లిన విపుడు?
ఏలనో నీమకుట చరణాన
నామనశ్శిఖరాలు
వామనత్వము గాంచు.

ఇవి యేమి నీ కిరీటస్వచ్ఛ
రోచిర్వికా సాలో
ప్రాచుర్య హాసాలో
ఈ సర్వలోకవ్యాప్త శర్వరి భయసుప్త
చలదుజ్జ్వలత్కాంతి తళతళలు, ధగధగలు
ఎవ్వరివి నాయెదుట